JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 01-04-2026
Medchal - Malkajgiri । Wednesday 01-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 304
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 304 । Pages : 8 । ₹: 5


2 లో

## పొంగులేటీ టార్గెట్ వెనుక... ఏం జరుగుతోంది

- బిఆర్ఎస్ పెద్దలు పొంగులేటి అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్
- పొంగులేటిని ఒత్తిడిలోకి నెట్టడం ద్వారా తమ పాత పనులను చక్కబెట్టుకోవాలనే వ్యూహం
- పొంగులేటి వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బతీయడం ద్వారా ఆయన రాజకీయ ప్రభావాన్ని తగ్గించవచ్చని బిఆర్ఎస్



✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 31 :

తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం బిఆర్ఎస్ వర్సెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య జరుగుతున్న యుద్ధం అత్యంత ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ఎక్కువగా పొంగులేటిని టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఒక కీలక విషయాన్ని లేవనెత్తారు. గత ప్రభుత్వ హయాంలో

...మిగతాది 2 లో



## బీఆర్ఎస్ మీద బురదజల్లడానికే ఇదంతా..

- హరీష్ రావు

✍ జయభేరి, హైదరాబాద్ :

రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పింది. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టాడని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా.

...మిగతాది 2 లో




## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

- తెలంగాణ పంచాయతీరాజ్ సంస్థలకు రూ. 247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్
- జీతాలకు కాకుండా కేవలం అభివృద్ధి పనులకే ఈ నిధులను వినియోగించాలని కేంద్రం నిబంధన విధించింది

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 31 :

తెలంగాణ పల్లెలకు కేంద్రం తీపి కబురు చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 1,500 కోట్లకు పైగా గ్రాంట్లను విడుదల చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ పంచాయతీరాజ్ సంస్థలకు రూ. 247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్ కేటాయించారు. ఈ నిధులతో రాష్ట్రంలోని 12600 గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన జరగనుంది. జీతాలకు కాకుండా కేవలం అభివృద్ధి పనులకే ఈ నిధులను వినియోగించాలని కేంద్రం నిబంధన విధించింది. తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి రూ. 247.94 కోట్ల నిధులను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత అన్‌టైడ్ గ్రాంట్స్ కింద ఈ నిధులను కేటాయించింది. తెలంగాణతో పాటు మరో ఐదు రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ. 1,500 కోట్లకు పైగా నిధులను కేంద్రం విడుదల చేసింది. కేంద్రం విడుదల చేసిన ఈ నిధుల ద్వారా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దాదాపు 12,600 గ్రామ పంచాయతీలకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. ఇవి అన్‌టైడ్ గ్రాంట్స్ కావడంతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయించిన ప్రాధాన్యత పనులకు ఈ నిధులను ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగునీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు

...మిగతాది 2 లో

## చల్లపల్లి పోలీస్ వాహనంలో అగ్నిప్రమాదం

- ఎస్సై సహ మరో నలుగురికి తీవ్ర గాయాలు
- బాణాసంచా పేలుడు ఘటన దిగ్భ్రాంతి
- చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే

- జయభేరి, నందిగామ :

చల్లపల్లి పోలీసు వాహనంలో అగ్ని ప్రమాదం జరిగింది. దీపావళి సందర్భంగా సీజ్ చేసిన టపాసులను తరలిస్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎస్సై సహ మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసు వాహనంలో టపాసులు ఒక్క సారిగా పేలి మంటలు చెలరేగటంతో వాహనం దగ్ధమైంది. ప్రమాదంలో డ్రైవర్ నాగరాజు, కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా, హెడ్ కానిస్టేబుల్ తేజ, ఎస్ ఐ దుర్గ వీరాంజనేయులుకు తీవ్ర గాయాలు అయ్యాయి.


...మిగతాది 2 లో

## బండారి కుటుంబానికి జీవిత కాలం గుర్తుండే జ్ఞాపిక

- ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ కు బండారి రాజిరెడ్డి కారిడార్ గా నామకరణం
- ఉప్పల్ నారపల్లి కారిడార్ కు ఉప్పల్ తొలి శాసనసభ్యులు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం చాలా సంతోషదాయకం.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


3 లో

## ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత

- పార్లమెంటులోకి కీలక బిల్లు.. సర్వత్రా ఉత్కంఠ
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే కేంద్ర కేబినెట్ భేటీలో ఈ సవరణ బిల్లుకు అధికారికంగా ఆమోదం

✍ జయభేరి, న్యూఢిల్లీ/ అమరావతి :

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. బుధవారం (ఏప్రిల్ 1న) లోక్‌సభలో ఏపీ పునర్విభజన చట్టం సవరణ బిల్లు 2026 పేరుతో ఈ ప్రతిపాదిత బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర హోంశాఖ ఇప్పటికే స్పీకర్ కార్యాలయానికి సమాచారం అందించింది. రాష్ట్ర విభజన తర్వాత నెలకొన్న రాజధాని సందిగ్ధతకు ముగింపు పలికేలా, అమరావతికి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. ఏప్రిల్ 1న ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే కేంద్ర కేబినెట్ భేటీలో ఈ సవరణ బిల్లుకు అధికారికంగా ఆమోదం తెలపనున్నారు. కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ఏపీ రాజధాని అమరావతి హోదాపై ఉన్న న్యాయపరమైన, సాంకేతిక పరమైన చిక్కులు తొలగిపోయి, కేంద్రం నుంచి అందే నిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు మార్గం సుగమం కానుంది. ఏపీ రాజకీయాల్లో, రాష్ట్ర అభివృద్ధిలో ఈ బిల్లు అత్యంత కీలకం కానుంది. గత కొన్నేళ్లుగా అమరావతి రాజధాని విషయంలో కొనసాగుతున్న ఉత్కంఠకు ఈ పార్లమెంటు బిల్లుతో ఒక స్పష్టత రానుంది.

...మిగతాది 2 లో

## రేవంత్ రెడ్డి మైండ్ బ్లోయింగ్ గ్రాఫ్

- ప్రధాని నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలవడం సహజమే..
- రేవంత్ రెడ్డి 25వ స్థానానికి చేరుకోవడం విశేషం
- భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర



✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 31 :

భారతదేశంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన స్థానం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలవడం సహజమే అయినా, కేవలం కొన్ని ఏళ్లలోనే ప్రాంతీయ స్థాయి నుంచి జాతీయ స్థాయి గుర్తింపు పొందడంలో రేవంత్ రెడ్డి సక్సెస్ గ్రాఫ్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ జాబితాలో ఆయనకు లభించిన 25వ స్థానం కేవలం ఒక అంకె మాత్రమే కాదు, అది ఆయన రాజకీయ చతురతకు, వ్యూహరచనకు నిదర్శనం. ఢిల్లీ రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే (43వ స్థానం), గాంధీ కుటుంబ వారసురాలు ప్రియాంక గాంధీ (35వ స్థానం) వంటి ఉద్ధండుల కంటే రేవంత్ రెడ్డి ముందు వరుసలో నిలవడం చిన్న విషయం కాదు. తన రాజకీయ గురువు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 13వ స్థానంలో ఉండగా, ఆయన శిష్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన రేవంత్, అనతి కాలంలోనే 25వ స్థానానికి చేరుకోవడం విశేషం.

...మిగతాది 2 లో

## ఏపీకి జూపల్లి వార్నింగ్



- తెలంగాణ రైతుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని జూపల్లి స్పష్టం
- తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరిక
- ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 31 :

శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేయడాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. నీటి మట్టం తగ్గినప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయకూడదనే నిబంధన ఉన్నా.. ఏపీ ప్రభుత్వం దాన్ని ఉల్లంఘిస్తోందని. ఈ చర్య వల్ల తెలంగాణలో పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఏపీ అలుసుగా తీసుకుందని.. తెలంగాణ రైతుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని జూపల్లి స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నా.. ఏపీ ప్రభుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇవాళ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మట్లాడిన ఆయన.. ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కార్ బరితెగించి నీటిని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే.. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## 15వ ఆర్థిక సంఘం నిధులు..

ఊతమివ్వనున్నాయి. అయితే ఈ నిధులను కేవలం అభివృద్ధి పనులకే వాడాలని, సిబ్బంది జీతాలు లేదా కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వినియోగించరాదని కేంద్రం స్పష్టమైన నిబంధనలు విధించింది. ఈ విడతలో అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 800 కోట్లు కేటాయించగా.. రాజస్థాన్‌కు రూ. 315.61 కోట్లు విడుదలయ్యాయి. ఉత్తరాఖండ్‌కు రూ. 91.31 కోట్లు, మేఘాలయకు రూ. 49.20 కోట్లు అందాయి. తెలంగాణకు కేటాయించిన రూ. 247.94 కోట్లు రాష్ట్రంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ గ్రాంట్లను నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోకి మళ్లిస్తోందని చెప్పారు. గతంలో నిధుల వినియోగంలో జరిగిన జాప్యం, మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ప్రతి పైసా ఆడిట్ కావాలని, గ్రామ పంచాయతీలు తమ అభివృద్ధి ప్రణాళికలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ నిధులను సకాలంలో పంచాయతీలకు చేరవేసి, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పల్లె ప్రగతిలో ఈ నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి. కాగా, గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగ్గా.. పల్లెల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. దాదాపు రెండేళ్లు ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు ఉండగా.. పాలకవర్గం కొలువుదీరటంతో అభివృద్ధి పనులు స్పీడ్‌గా కొనసాగుతున్నాయి.

## ఏపీ రాజధాని అమరావతికి..

కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేయడంతో ఏపీ ప్రజలు, అమరావతి రైతులు ఈ పరిణామంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. 2014 విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఉంటుందని పేర్కొన్నారే తప్ప, 'అమరావతి' అనే పేరును స్పష్టంగా పొందుపరచలేదు. గత ప్రభుత్వ హయాంలో తలెత్తిన 3 రాజధానుల గందరగోళం భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే, విభజన చట్టంలోనే అమరావతి పేరు ఉండాలని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం సెక్షన్ 5(2) కు సవరణ కోరుతూ చేసిన ఈ తీర్మానం కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు, అమరావతికి బలమైన చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా వేసిన అడుగు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానం తదుపరి చర్యల కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. సాధారణంగా ఇటువంటి అంశాలపై నిర్ణయం తీసుకోవడానికి సమయం పట్టినప్పటికీ, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సమన్వయం కారణంగా ఈ ప్రక్రియ వేగవంతం కానుంది. కేంద్ర క్యాబినెట్ ఈ ప్రతిపాదనను పరిశీలించి ఆమోదం తెలిపిన తర్వాత, దీనిని ఒక సవరణ బిల్లు రూపంలో పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. లోక్‌సభ మరియు రాజ్యసభలు ఈ బిల్లును ఆమోదించి, రాష్ట్రపతి సంతకం చేసిన వెంటనే ఇది గెజిట్ నోటిఫికేషన్‌గా మారుతుంది. పార్లమెంట్ ఆమోదంతో 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో అమరావతి పేరు అధికారికంగా చేరుతుంది. దీనివల్ల అమరావతికి 'స్టాట్యూటరీ స్టేటస్' (చట్టబద్ధమైన హోదా) లభిస్తుంది. ఈ చట్టపరమైన రక్షణ వల్ల భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, పార్లమెంట్ చట్టాన్ని మార్చకుండా రాజధానిని మార్చడం సాధ్యం కాదు. ఇది అమరావతి ప్రాంత రైతులకు, అక్కడ పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు మరియు ప్రజలకు పెద్ద ఎత్తున భరోసాను ఇస్తుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో సానుకూల సంకేతాలు ఇవ్వడంతో, ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ముందుకు రావడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక మార్పులు తేనున్నాయి. ముఖ్యంగా ఈ బుధవారం లోక్‌సభలో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న సమయంలో ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుసరించబోయే వ్యూహం ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన పలు బిల్లులకు మద్దతు నిలిచిన వైసీపీ, సొంత రాష్ట్ర ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అమరావతి విషయంలో ఏ అడుగు వేస్తుందన్నది రాజకీయ విశ్లేషకులకు ఒక సవాలుగా మారింది.ఇటీవలే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ చేసిన తీర్మానానికి వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకాకుండా దూరంగా ఉన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానాన్ని అధికారికంగా స్వాగతించకపోవడమే కాకుండా, ఇది కేవలం రాజకీయ డ్రామా అని ఆ పార్టీ నేతలు కొట్టిపారేస్తున్నారు. ఈ కారణంగా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు వైసీపీ ఎంపీలు దీనిని వ్యతిరేకిస్తారా లేదా గైర్హాజరవుతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ వ్యతిరేకిస్తే అమరావతి వ్యతిరేకి అనే ముద్ర పడే ప్రమాదం ఉంది, సమర్థిస్తే తమ పాత మూడు రాజధానుల వాదనకు తిలోదకాలు ఇచ్చినట్లవుతుంది.వైసీపీ నేతలు గత కొన్ని రోజులుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే ఇతర ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందనే ప్రచారాన్ని వారు గట్టిగా వినిపిస్తున్నారు. ఈ వ్యూహం ద్వారా అమరావతి బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించడానికి ఒక బలమైన సాకును వెతుక్కుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించే క్రమంలో నేరుగా బిల్లును వ్యతిరేకించకుండా, చర్చలో పాల్గొని తమ అభ్యంతరాలను వ్యక్తం చేసి ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశం కూడా లేకపోలేదని అంచనా వేస్తున్నారు. రాజకీయంగా చూస్తే వైసీపీ ఇప్పుడు ఆత్మరక్షణలో పడింది. అమరావతికి చట్టబద్ధత లభిస్తే, భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా రాజధానిని మార్చడం అసాధ్యం అవుతుంది. ఇది జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన వికేంద్రీకరణ సిద్ధాంతానికి గట్టి దెబ్బ. అందుకే, వైసీపీ ఈ బిల్లును పరిపాలనాపరమైన అవసరం కంటే రాజకీయ కక్ష గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. పార్లమెంట్‌లో టీడీపీ సభ్యులు దూకుడుగా వ్యవహరించడం ఖాయం కాబట్టి, వారిని ఎదుర్కోవడానికి వైసీపీ తన వికేంద్రీకరణ' అస్త్రాన్ని మళ్ళీ బయటకు తీసే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుపై వైసీపీ తీసుకునే నిర్ణయం ఆ పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశను, అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ఓటర్ల మొగ్గును శాసించనుందని అంచనా వేస్తున్నారు.

## రేవంత్ రెడ్డి మైండ్ బ్లోయింగ్ గ్రాఫ్

తెలంగాణ కాంగ్రెస్‌లో హేమాహేమీల వంటి సీనియర్లు ఉన్నప్పటికీ, అధిష్టానం రేవంత్ రెడ్డికే పగ్గాలు అప్పగించడం వెనుక ఉన్న నమ్మకాన్ని ఆయన వంద శాతం నిలబెట్టుకున్నారు. రేవంత్ రెడ్డి కేవలం ఒక ముఖ్యమంత్రిగానే కాకుండా, పార్టీని నడిపించే ఒక శక్తివంతమైన సైన్యాధ్యక్షుడిగా ఎదిగారు. కాంగ్రెస్ వంటి అంతర్గత ప్రజాస్వామ్యం, అసమ్మతి ఎక్కువ ఉన్న పార్టీలో, అందరినీ కలుపుకుపోతూ గ్రూపు రాజకీయాలకు తావులేకుండా చేయడంలో ఆయన సఫలమయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను ఉత్సాహపరచడం, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేయడంలో రేవంత్ స్టైల్ ప్రత్యేకం. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగుతున్నారు. దూకుడుగా ఉండే ప్రసంగాలు, తడబడని నడక ఆయనను యువతలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి.సాధారణంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిరంతరం ఘర్షణ వైఖరిని అవలంబిస్తుంటారు. కానీ, రేవంత్ రెడ్డి ఇక్కడ విలక్షణమైన పంథాను అనుసరిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే, రాజకీయంగా ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో ఆయనకు బాగా తెలుసు. మోదీ సర్కార్ కూడా తెలంగాణ ప్రభుత్వానికి సానుకూలంగా స్పందిస్తుండటం రేవంత్ రెడ్డి దౌత్యనీతికి నిదర్శనం. వివాదాల కంటే అభివృద్ధి ముఖ్యం అనే ధోరణితో ఆయన కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు రాబట్టుకోవడంలో సక్సెస్ అవుతున్నారు. ఈ పవర్ ఫుల్ పర్సన్స్ జాబితా ఒక సంకేతాన్ని స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించబోతున్నారు. దక్షిణాదిలో పార్టీని బలోపేతం చేయడమే కాకుండా, జాతీయ స్థాయిలో మోదీ వంటి బలమైన నాయకుడిని ఎదుర్కోవడంలో రేవంత్ వ్యూహాలు పార్టీకి కీలకం కానున్నాయి. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి దేశంలోనే 25వ అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఎదిగిన రేవంత్ రెడ్డి ప్రస్థానం, రాజకీయాల్లో పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపిస్తోంది.

# కంగారు పెట్టించిన కగార్

**ఆపరేషన్ కగార్... మావోయిస్టులను కంగారు పెట్టేసింది. ఉడుకు రక్తంతో చావంటే తెలియని భయం... వయసు మీరిన తర్వాత వారి వెన్నులో వణుకు పుట్టించింది. మావోయిజంపై ఉక్కుపాదం మోపుతామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలతో భయపెట్టింది. ఆ హెచ్చరికలను మావోయిస్టులు లైట్ తీసుకోవడంతో యాక్షన్ ప్లాన్ అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వాన్ని భయపెట్టిన మావోలు.. ఇపుడు వాళ్లనే ప్రభుత్వం భయపడే స్థితికి తీసుకొచ్చింది. ఇంతకీ మన దేశంలో మావోల శకం ముగిసినట్టేనా.. వారికి నూకలు చెల్లినట్టేనా..**



కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆపరేషన్ కగార్ చేపట్టిన భద్రతా బలగాలు అడవులను జల్లెడపట్టింది. కనిపించిన మావోలను కనిపించనట్టుగా మట్టుబెట్టింది. ఆపరేషన్ కగార్... సత్ఫలితాలనిచ్చింది. మావోయిస్టు ఉద్యమంలో తలపండిన ఉద్ధండులు సైతం స్వచ్ఛందలొంగుబాటుకు దారితీసింది. దీంతో ఆ ఉద్యమం కనుమరుగైపోయింది. మావోయిస్టు ఉద్యమం రక్తాక్షరాలతో చరిత్రగా నిలిచిపోయింది. ఒకటే లక్ష్యం... భారత దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని కనుమరుగు చేయాలి. ఉద్యమంలో ఉన్నవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చి కొత్త జీవితాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీంతో తుపాకి వీడండి.. అడవుల్లో అజ్ఞాతం లోంచి జనజీవన స్రవంతిలోకలవండి అనే పిలుపుతో వెనుకాడిన మావోయిస్టులు.ఎన్ కౌంటర్ల తర్వాత స్వచ్ఛంద నిర్ణయంతో మనసు మార్చుకున్నారు. దీంతో మంచి నిర్ణయం తీసుకుని ప్రజాజీవితంలో గడిపేందుకు సమ్మతించారు. మావోయిస్టు ఉద్యమం ఒక చరిత్ర సృష్టించింది. ఇది నిజం. ప్రజాపాలనలో ప్రజా ఉద్యమంగా పురుడుపోసుకున్న మావోయస్టుల పోరాటం ముగిసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అడవుల్లో అన్నలు... పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రం వాళ్లను మోకాళ్లపై నిలబెట్టిందనే చెప్పాలి. ఈ క్రెడిట్ అంతా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకే దక్కుతుంది. భద్రతా బలగాలకు ఇచ్చిన స్వేచ్ఛతో పాటు పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకొని మావోయిస్టులను అష్ట దిగ్బంధనం చేశారు. మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, దామోదర్ , గంగన్న లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసిందనే చెప్పాలి. మావోయిస్టు పార్టీ చరిత్రలోనే ఇది అత్యంత కీలక లొంగుబాటుగా చెప్పవచ్చు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలోకలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ కుమ్మూదాదా , కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. మావోయిస్టులు ప్రభావం ఉన్న మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విప్లవాత్మ మార్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల అగ్రనేతలు ఒక్కొక్కరుగా... తమ అనుచరగణంతో పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు.నక్సలైట్ల ఘాతుకానికి బలైన వారిలో అత్యధికులు పోలీసులు కాగా...పోలీసులకు సమాచారం అందించారని ఇన్‌ఫార్మర్లపేరుతో అమాయకులను దారుణంగా కాల్చిచంపేశారు మావోలు. ఈ దారుణాలతో ప్రభుత్వాలనే కాదు.. అడవీ ప్రాంత ప్రజానీకాన్ని మావోలు భయపెట్టారు. గ్రామాల్లో ఉన్నవారు భయపడుతూ.. నక్సలైట్లకు ఆశ్రయిం కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్ని సౌకర్యాలను సమకూర్చాలి. సమీప బ్యాంకులను దోపిడీ చేయడం, పారిశ్రామిక వేత్తలను, పెద్ద పెద్ద భూ స్వాములను, కాంట్రాక్టర్లను, రాజకీయ నాయకులను బెదిరించి ఆర్థిక వనరులు సమకూర్చుకునేవారు. మాటవినకుండా.. చందాలు ఇవ్వని వారిని ప్రాణాలు తీసే విషయంలో వెనుకాడేవారు కాదు. మావోయిస్టుల మాట వింటేనే జీవితం.. వ్యతిరేకిస్తే మరణమే శాసనంగా అమలుచేశారు.

వరుసగా జరిగిన పరిణామాలతో మావోయిస్ట్ అగ్ర నాయకురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క... పొలిట్ బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్... కేంద్ర కమిటీ సభ్యులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న... అగ్ర నాయకులంతా వరుసగా సుమారు 210 మంది మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తెలంగాణకు చెందినవారే. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈయన మావోయిస్ట్ ఉద్యమంలో ప్రవేశించి అంచెలంచెలుగా అగ్రస్థానానికి చేరుకున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుతో తుపాకీని పక్కనపెట్టి... అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు.

ప్రజా సమస్యల పరిష్కారంకోసం... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గడగడలాడించిన మావోయిస్టు ఉద్యమం కనుమరుగైపోయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆంక్షలు... అడవుల్లో గాలింపు చర్యలు... ఆపరేషన్ కగార్ అద్భుత ఫలితాలను ఇచ్చిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇకనుంచి అడవుల్లో తుపాకుల అలజడి వినపడదు. ఎదురు కాల్పులు జరగవు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు హెచ్చరికలుండవు.. అడవుల్లో ఎదురుకాల్పుల్లేని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందనే అభిప్రాయం పోలీసుల్లో వ్యక్తమవుతోంది.



# చల్లపల్లి పోలీస్ వాహనంలో అగ్నిప్రమాదం

- **బాణాసంచా పేలుడు ఘటన దిగ్భ్రాంతి కలిగించింది**
- **చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**
- **ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే**

**జయభేరి, నందిగామ :**

చల్లపల్లి పోలీస్ స్టేషనులో బాణాసంచా పేలుడు ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం చల్లపల్లి పోలీస్ స్టేషనులో దీపావళి టపాసుల పేలుడు ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పేలుడు ధాటికి గురై ధ్వంసమైన ఎస్ఐ కారు, స్టేషన్ భవనం, భీతావహంగా మారిన పరిసరాలు పరిశీలించారు. ఘటనా స్థలంలో పగిలిపోయిన కుండీలు, స్టేషన్ వరండాలో దెబ్బ తిని పలు చోట్ల కాలిపోయిన రిసెప్షన్ కౌంటర్, పగిలిపోయిన ఎస్ఐ గది డోర్, దెబ్బ తిన్న వెనుక గుమ్మం, వరండా పక్క గదిలో ఊడిపోయిన సీలింగ్ పరిశీలించారు. చల్లపల్లి సీఐ కే.ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ పామర్తి గౌతమ్ కుమార్ ఘటన జరిగిన తీరును ఎమ్మెల్యేకు వివరించారు. ప్రమాదంలో గాయపడిన చల్లపల్లి ఎస్ఐ డీ .దుర్గా ఆంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా, కానిస్టేబుల్ డీ.నాగరాజులకు ఎక్కువ గాయాలు కాగా వారిని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. స్వల్ప గాయాలకు గురైన హెడ్ కానిస్టేబుల్ తేజ, కానిస్టేబుల్ శివపార్వతి చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ దీపావళి టపాసులు కోర్టుకు తరలించే క్రమంలో ప్రమాదవశాత్తు సంభవించిన ఈ ఘటనలో ఎస్ఐ సహా ఐదుగురు పోలీస్ సిబ్బంది గాయాలకు గురికావడం బాధాకరం అన్నారు. వారిలో ఎవరికీ ప్రాణాపాయం వాటిల్లకపోవడం అదృష్టం అన్నారు. పేలుడు ధాటికి భవనంలోని అన్ని గదులు దెబ్బ తిన్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రమాద ఘటనలో క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ తేజ, మహిళా కానిస్టేబుల్ శివపార్వతిలను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

## ఏపీకి జూపల్లి వార్నింగ్

నీళ్లు లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని తరలించడం అన్యాయమని ఫైరయ్యారు.జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారని.. తాము ధర్నాకు దిగే వరకు ఆ దోపిడీ ఆగలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. నాడు ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా.. అక్రమ నీటి తరలింపును ఆపాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శ్రీశైలం నీటిలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని.. దక్షిణ తెలంగాణ రైతాంగం హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'మీరేమైనా చదువురాని వాళ్లా? జీవోలు స్పష్టంగా ఉన్నాక ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముంది?' అంటూ ఏపీ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే.. ఏపీ ప్రభుత్వం మాత్రం చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫైరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవటం వల్లే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని విమర్శించారు.

ఏపీ ప్రభుత్వం తన అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం, రైతులు, కాంగ్రెస్ పార్టీ సమిష్టిగా పోరాటం చేస్తామని జూపల్లి హెచ్చరించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని.. ఈ క్రమంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ నీటి వాటాను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఏపీ ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని లేదంట తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి జూపల్లి కృష్ణారావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## పొంగులేటీ టార్గెట్ వెనుక...

జరిగిన కొన్ని అక్రమ వ్యవహారాలు, కొత్త ప్రాజెక్టుల విషయంలో బిఆర్ఎస్ నేతలు చేస్తున్న పైరవీలకు పొంగులేటి అడ్డుపడుతున్నారని, అందుకే ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. గతంలో తమకు అనుకూలంగా ఉన్న వ్యవస్థలను పొంగులేటి ఇప్పుడు ప్రక్షాళన చేస్తుండటంతో, తమ పనులు కావడం లేదన్న కోపంతోనే బిఆర్ఎస్ పెద్దలు పొంగులేటి అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నారని అధికార పక్షం వాదన. పొంగులేటిని ఒత్తిడిలోకి నెట్టడం ద్వారా తమ పాత పనులను చక్కబెట్టుకోవాలనే వ్యూహం ఇందులో ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, బిఆర్ఎస్ నేతలు మాత్రం పొంగులేటిపై అక్రమ మైనింగ్ అనే అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తున్నారు. కేవలం అసెంబ్లీకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా దీనిని ఒక పెద్ద స్కామ్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. పొంగులేటి వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బతీయడం ద్వారా ఆయన రాజకీయ ప్రభావాన్ని తగ్గించవచ్చని బిఆర్ఎస్ భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. గతంలో తమ పార్టీలో ఉన్న వ్యక్తి కావడంతో, ఆయన బలహీనతలు తమకు తెలుసని, అందుకే పకడ్బందీగా ఆధారాలతో దాడి చేస్తున్నామని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అయితే, ఇది నిజంగా అవినీతిపై పోరాటమా లేక రాజకీయ కక్షసాధింపా అన్నది ప్రజల్లో చర్చనీయాంశమైంది.రాజకీయంగా చూస్తే, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తీశారు. గత ఎన్నికల్లో అక్కడ బిఆర్ఎస్ క్లీన్ స్వీప్ అవ్వడానికి ఆయనే ప్రధాన కారకుడు. భవిష్యత్తులో కూడా ఆయన తన పట్టును పెంచుకుంటే బిఆర్ఎస్ ఆ జిల్లాలో కోలుకోవడం అసాధ్యం. అందుకే, ఆయనపై అవినీతి ముద్ర వేయడం ద్వారా ప్రజల్లో ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయాలనేది బిఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి కంటే పొంగులేటిని టార్గెట్ చేయడం వల్ల అటు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టవచ్చు, ఇటు తమ బద్ధశత్రువుపై పగ తీర్చుకోవచ్చు అనే వ్యూహం అమలు చేస్తున్నారని భావిస్తున్నారు.

## బీఆర్ఎస్ మీద బురదజల్లడానికే ఇదంతా..

సీఆర్ పాటిల్ ఒకసారి తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను అడిగితే, నీళ్లు ఎప్పుడు వచ్చాయి, ఎలా వచ్చాయని స్పష్టంగా తెలుస్తుంది. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. ఒక్క 50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేడు . మీకు మా మీద కోపం ఉంటే తీర్చుకోండి కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని అన్నారు.




# జయలలిత ఇల్లు సీజ్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 31 :**

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత జయలలితకు చెందిన హైదరాబాద్ లోని తన నివాసాన్ని అధికారులు సీజ్ చేశారు.హైదరాబద్ లోని శ్రీనగర్ కాలనీలో ఉన్న జయలలిత విల్లాకు 1.60 కోట్ల రూపాయలు ఇంటి పన్ను బకాయిలు ఉండటంతో GHMC అధికారులు విల్లాను సీజ్ చేసినట్లుగా తెలుస్తోంది. గత కొంత కాలంగా ఇంటి పన్ను బకాయిలు పెండింగ్ లో ఉండటం, పలు మార్లు నోటీసులు ఇచ్చినా, ఎవరూ స్పందించకపోవడంతో జయలలికు చెందిన హైదరాబాద్ నివాసాన్నిస్వాధీనం చేసుకున్నారు. ఈ భవనం గతంలో ప్రముఖ వ్యాపారావేత్త విజయ్ మాల్య లీజుకు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. విజయ్ మాల్యా లీజుకు తీసుకున్న నాటి నుండి నేటి వరకూ ఇంటి పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించకపోవడంతో , పెండింగ్ బకాయిలు పేరుకుపోయినట్లుగా అధికారులు గుర్తించారు.తమిళనాడు రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన జయలలిత, ముఖ్యమంత్రిగా దశాబ్దాల పాటు తమిళనాడు ప్రజలకు సేవలందిచారు. తమిళనాడు ప్రజలు ఆమెను అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు.నేటికీ తమిళనాడులో జయలలిత క్రేజ్ తగ్గలేదు. ఆమె భౌతికంగా లేనప్పటికీ , ఆమె అభిమానులు, నాయకులు పెద్దసంఖ్యలో ఉన్నారు. తమినాడు రాజకీయాలను ప్రభావితం చేయగలిగేలా అమ్మ ఫాలోవర్స్ ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.తమిళనాడులో అనారోగ్యం కారణంగా జయలలిత మరణించిన నాటి నుండి ఆమె ఆస్తులపై వివదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో ఆమెపై నమోదైన ఆదానికి మించి ఆస్తులున్న కేసు దేశవ్యాప్తంగా పెను దుమారం రేపింది. అప్పట్లో భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. ఏకంగా మూడు ట్రంకు పెట్టెల్లో భద్రపరిచి ప్రభుత్వానికి ఆమె ఆస్తులను ఆదాయపు పన్నుశాఖ అధికారులు అప్పగించారంటే పరిస్థితి అర్ధం చేసుకోవచ్చు. తాజాగా హైదరాబాద్ నగరంలో జయలలితకు చెందిన విల్లా సీజ్ చేయడం తీవ్ర దుమారం రేపుతోంది.

# బండారి కుటుంబానికి జీవిత కాలం గుర్తుండే జ్ఞాపిక

- ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ కు బండారి రాజిరెడ్డి కారిడార్ గా నామకరణం
- ఉప్పల్ నారపల్లి కారిడార్ కు ఉప్పల్ తొలి శాసనసభ్యులు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం చాలా సంతోషదాయకం.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ మార్చి 31 :**

ఒక నిజాయితీ గల నిస్వార్ధ నాయకుడు బండారి రాజిరెడ్డి వారు వారి కుటుంబం సుమారు 50 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో ఉండి పార్టీకి ఎన్నిలేని సేవ చేయడం జరిగింది. వారు కాప్రా తొలి మున్సిపల్ చైర్మన్ గా సేవలందించడం జరిగింది అలాగే ఉప్పల్ తొలి శాసనసభ్యులుగా సేవలందించడం జరిగింది అలాగే ఎంతో అత్యున్నతమైన తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ గా సేవలందించడం జరిగింది. అలాంటి గొప్ప నాయకుడి పేరు కారిడార్ కు పెట్టడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బండారి కుటుంబానికి జీవిత కాలం గుర్తుండే జ్ఞాపికను ఇవ్వడమే. బండారి రాజిరెడ్డి సొంత తమ్ముడు నేడు బారాస పార్టీ నుండి ఉప్పల్ శాసనసభ్యులుగా ఉన్నా కూడా ముఖ్యమంత్రి ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా ఇచ్చిన మాట ప్రకారం కారిడార్కు రాజిరెడ్డి పేరు పెట్టడం రాజిరెడ్డి కుటుంబం ఎప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గుర్తుంచుకుంటుంది. కారిడార్కు అన్న పేరు రావాలని బండారి లక్ష్మారెడ్డి చేసిన కృషి దగ్గర నుండి చూసిన వ్యక్తిగా నేను రాజిరెడ్డి లాంటి గొప్ప నాయకుడి లక్షణాలు ఉనికిపుచ్చుకున్న మరో గొప్ప నాయకుడు మన బండారి లక్ష్మారెడ్డి. తన అన్న అడుగుజాడల్లో నడుస్తూ తన అన్న ఆసియా సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తూ నిజాయితీగా నిస్వార్ధ సేవలందిస్తున్న గొప్ప నాయకుడు మన బండారి లక్ష్మారెడ్డి. బండారి రాజి రెడ్డికి నిజమైన నివాళి ఈరోజు తన తమ్ముడు కష్టపడి ప్రభుత్వాన్ని ఒప్పించి ఇంత పెద్ద కారిడార్కు వారి అన్న పేరు పెట్టేలా కృషి చేయడం నిజంగా రాజి రెడ్డి చేసుకున్న పుణ్యమే లక్ష్మారెడ్డి తమ్ముడు ఉండడం.

ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన "ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్"కు " బండారి రాజిరెడ్డి కారిడార్"గా నామకరణం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎం.ఎస్. నెం.104కు సంబంధించి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన మా అన్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను స్మరించుకుంటూ ఈ నామకరణం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన ముందడుగని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఇదే విధంగా ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## స్టడీ హాల్స్ ఏర్పాటుచేయడం అభినందనీయం

**జయభేరి, కాప్రా :**

ECIL పరిధిలో గల గ్రీన్ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన రాధా స్టడీ హాల్స్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కార్మిక శాఖ మంత్రి Dr. గడ్డం వివేక్ తో కలిసి ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇలాంటి స్టడీ హాల్స్ ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రశాంత వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి విజయానికి ఇది దోహదపడుతుందని అన్నారు. మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ, యువతకు విద్యా వనరులు అందుబాటులో ఉండడం చాలా అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు స్థానిక నాయకులు, విద్యార్థులు, ప్రాంతీయ ప్రజలు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైన్ నిర్మించండని ఎమ్మెల్యేకు వినతి



**జయభేరి, ఉప్పల్ :**

నాచారం డివిజన్ భవాని నగర్ లో బండారి లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే ఎన్నికైన తర్వాత భూగర్భ డ్రైనేజీల కొరకు అలాగే సిమెంట్ రోడ్ల కొరకు నిధులు మంజూరు చేయడం జరిగింది. పనులు చకచకా నడుస్తున్నాయి. కానీ వర్షాకాలంలో తార్నాక, విఎస్ టి కాలనీ స్నేహపురి కాలనీలోని వరద నీరు భవాని నగర్ లో వచ్చి ఇళ్లలోకి చేరుతుందని.. ఈ సమస్య పరిష్కరించడానికి.. హనుమాన్ టెంపుల్ నుండి పెద్దనాల వరకు బాక్స్ డ్రైన్ నిర్మించాలని భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేయడం జరిగింది. తప్పకుండా బాక్స్ డ్రైన్ కొరకు నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, రాయుడు మధుసూదన్ రెడ్డి, BRS నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- యాదగిరిగుట్ట మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 31:**

ప్రజల భాగస్వామ్యంతోనే వార్డు అభివృద్ధి జరుగుతుందని యాదగిరిగుట్ట మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బుచ్చిదాసు ఆశ్రమంలో 12వ వార్డు సభ నిర్వహించారు. 12వ వార్డు అభివృద్ధికి ప్రజలను భాగస్వాములను చేయాలని, తద్వారా సమస్యలు త్వరితగతిన సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి ఓ ప్రణాళిక ప్రకారం 12వ వార్డును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 12వ వార్డు సభలో శానిటేషన్, వాటర్, విద్యుత్, వీధి దీపాలు, ఆరోగ్యం వంటి సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ గౌడ్, ఏఎస్ఐ రమేష్, ఆశా వర్కర్లు నిర్మల, జ్యోతి, ఆర్‌పీలు భాగ్య, నాగమణి, భార్గవి, సత్యవతి, వాటర్, విద్యుత్ ఇంచార్జి అంబేద్కర్, మల్లేశ్, మధు, 12వ వార్డు ప్రజలు కోక్కల రవి, రాయగిరి జగదీష్, బడుగు మల్లేశ్, గుండ్లపల్లి శ్రీరామ్, మల్లెపల్లి బలరాం, బబ్బూరి వెంకటేష్, గుండ్లపల్లి లింగం, హరికృష్ణ, కార్తీక్, గడ్డమీద రాజాలు, మహిళలు మచ్చా నర్సు బాయ్, జగిని స్వాతి, కోల సుశీల తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

- ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంగళవారం దేవరకద్రలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, ఉపసర్పంచ్ గోవర్ధన్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు విక్ర వర్ధన్ రెడ్డి, గ్రామ నాయకులు ఫక్రుద్దీన్, శ్రీహరి, వాకిటి వెంకటేష్, కుమ్మరి పాండు లతోపాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఎండలో సైతం ఓపికతో కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరు

- ఎమ్మెల్యేకు ప్రజల నుండి అభినందనలు వెల్లువ

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మంగళవారం నియోజకవర్గంలోని ఆయా మండలాలలో సుడిగాలి పర్యటన జరిపారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఎంతో ఓపికతో నియోజకవర్గంలోని భూత్పూర్, దేవరకద్ర మండలాలలో జరిగిన పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. అలాగే మండలంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా అందజేశారు. దీంతో ఎమ్మెల్యే జిఎంఆర్ కు ప్రజలు అభినందిస్తున్నారు. రాత్రి, పగలనక నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు. గత రెండు రోజులుగా హైదరాబాద్ లో జరిగిన అసెంబ్లీ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి అక్కడ జరిగిన క్రీడలకు సాటి ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే నేరుగా హాజరయ్యారు. పలు కార్యక్రమాలను పాల్గొన్నారు.

## గోశాలో కోడెలు మృతి



**జయభేరి, వేములవాడ :**

వేములవాడ గోశాలలో అనారోగ్యంతో నాలుగు కోడెలు మృతి చెందాయి. వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న తిప్పాపురం గోశాలలో అనారోగ్యంతో నాలుగు కోడెలు చనిపోయాయి. ఎండ తీవ్రత వల్ల చనిపోయాయని సిబ్బంది చెప్తున్నా, సరైన నిర్వహణ, వసతులు లేకనే కోడెలు చనిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

- భీమిడి జైపాల్ రెడ్డి
- రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 31:**



మహాలక్ష్మి పథకం రాష్ట్రం లోని మహిళలకు ఎంతో చేకూరుస్తుందని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. శామీర్ పేట డివిజన్ పరిధిలోని హకింపేట డిపోలో ఆర్టీసీ అధికారులు మహిళలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భీమిడి జైపాల్ రెడ్డితో పాటు మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి ఇంద్ర హాజరయ్యారు. అనంతరం పలువురు మహిళలను సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం దిగ్విజయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారుగా 290 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణం చేశారని గుర్తు చేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ధృడ సంకల్పంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు , ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దేవరయాంజాల్‌లో రామనామంతో మారుమ్రోగిన హంససేవ వైభవం

- శోభాయమాన హంసవాహనంపై స్వామివారి ఊరేగింపు
- రామనామ ధ్వనులతో మారుమ్రోగిన దేవరయాంజాల్ – హంసవాహనంపై సీతారాముల వైభవ దర్శనం

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 31:**



మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్ గ్రామం బుధవారం సాయంత్రం రామనామ జపంతో మారుమ్రోగింది . శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన హంససేవ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించిన ఆలయ సిబ్బంది సాయంత్రం వేళ దేవాలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైన హంసవాహన సేవాతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలుముకుంది. దేవస్థానం ఈవో వీరేశం పర్యవేక్షణలో, దాతల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందాళ సీతారామ చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని శోభాయమానంగా హంస వాహనంపై అలంకరించి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. హంస వాహనంపై విరాజిల్లుతున్న సీతారాముల దర్శనం కోసం భక్తులు తండోప తండాలుగా విచ్చేసారు. ఊరేగింపులో భాగంగా భక్తులు స్వామివారికి హారతులు పట్టి, భజనలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికితే, యువత భక్తిగీతాలతో ఉత్సాహాన్ని నింపారు. ఈ వేడుకలతో గ్రామం అంతా ఆధ్యాత్మిక పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని, ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జాతర మరియు గురువారం ఉదయం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు, ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్లు పేండం లక్ష్మినారాయణ, దాసరి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, బీజేపీ మున్సిపల్ మాజీ అధ్యక్షులు పట్నం నర్సింహారెడ్డి, మాజీ ధర్మకర్తలు బక్కొల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

**జయభేరి, నరసరావుపేట :**

నరసరావుపేట గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతులను పల్నాడు జిల్లాలోని గుండాలపాడు గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. ప్రమాద ధాటికి బాధితులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఎలా జరిగిందో దర్యాప్తు చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గుండాలపాడు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# ప్రజా ప్రతినిధులు ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలి




- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి
- భూత్పూర్ లో జనరల్ బాడీ సమావేశం

జయభేరి, దేవరకద్ర :

ప్రజా ప్రతినిధులు భవిష్యత్తు తరానికి ఆదర్శంగా నిలవాలని మహబూబ్ బ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (,జిఎంఆర్) అన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు.

మున్సిపల్ ఎన్నికల తరువాత ఈ మొదటి జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో నూతనంగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల ఆశీర్వాదం, దీవెనలతో గెలిచినా మీరు మంచి పనులు, ప్రజలకు సేవ చెస్తే.. మీ పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే అన్నారు. నిబద్ధత, క్రమ శిక్షణ తో పని చేయాలని సూచించారు.ఎన్నికల సమయంలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజల ఇబ్బందులు తీర్చడానికి నిరంతరం కృషి చేయండి, నా వంతు పూర్తి సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భూత్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కి సంబంధించి ఇటీవలే 15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, నీటి సమస్యలు తలెత్తకుండా, అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.నీటి సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది, దాని కోసం ఎన్ని నిధులైన ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

ఈ సందర్భంగా డ్రైనేజీ, విద్యుత్ లైట్లు, ట్రాఫిక్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు, సిసి రోడ్లు, తాగునీరు, మౌలిక వసతులు తదితర అంశాలపై సమావేశం లో అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ చర్చించారు. పలు నిర్ణయాలు తీసుకున్నారు. అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## భూత్పూర్ లో చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) నాయకులు అధికారులతో కలిసి అందజేశారు.అలాగే ముఖ్యమంత్రి సహాయనిదధి చెక్కులను కూడా ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాపతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం



జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 31 :

తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ శివరాత్రి లావణ్య జహంగీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గేదలు ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు ఇప్పించుకోవాలని కోరారు. గ్రామంలో 129 పశువులకు టీకాలను ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ శేఖర్, వెటర్నరీ అసిస్టెంట్లు రాఘవేంద్ర, శంషుద్దీన్, గోపాలమిత్ర బాలేష్, వార్డు సభ్యులు, రైతులు పోతరాజు మహేష్, పోతరాజు గణేష్, గుర్రాల స్వామి పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ నల్ల పోచమ్మ ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం



జయభేరి, గజ్వేల్, మార్చి 31 :

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 5 వ వార్డు లో ఉన్న శ్రీ ముత్యాలమ్మ నల్ల పోచమ్మ ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ ముత్యాలమ్మ నల్ల పోచమ్మ అమ్మవార్లకు ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ సంఘం మరియు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు చేసి బోనాలు సమర్పించారు. అంతే కాకుండా మహిళలు పెద్దఎత్తున పాల్గొని కుంకుమార్చన చేసి అమ్మవార్లకు దీపారాధన చేశారు. ఈసందర్భంగా బీజేపీ 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ కు మరియు బీజేపీ నాయకులకు, టెంట్ హౌస్ నర్సింలు లకు ఆలయ కమిటీ చైర్మన్ డాకని బిక్షపతి , గుండ్ర నర్సింలు , ఈది యాదగిరి , చిన్నోళ్ళ రామచంద్రం , గుండ్ర రామచంద్రం లు శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ సంఘం నాయకులు , ఆలయ కమిటీ సభ్యులు, జాంబవ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందజేసిన మలబార్ గోల్డ్ సంస్థ




జయభేరి, పరవాడ:

మండల కేంద్రం అయ్యిన పరవాడ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మలబార్ గోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో సిఎస్ఆర్లో భాగంగా పేద విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందజేసే కార్యక్రమం మంగళవారం గాజువాక ఆ సంస్థ కార్యాలయం లో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరవాడ స్థానిక జూనియర్ కాలేజ్ విద్యార్థులు 30 మంది ఎంపిక అయ్యారు.ఈ కార్యక్రమం వలన విద్యార్థులకు ఆర్థికంగా భోరోసాను ఇస్తూ వారి విద్యకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్కాలర్షిప్‌లు ఎంతగోనో దోహదపడుతుంది అని ఆ సంస్థ ప్రతినిధులు ఆశభావం వ్యక్తం చేసారు.ఇందులో భాగంగా ఒక్కొక్కరికి రూ. 8,000 చొప్పున, మరికొంతమందికి రూ. 10,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు అదనంగా వారికి సర్టిఫికెట్లు కూడా ప్రదానం చేసారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ తల్లి గోవిందరెడ్డి, గాజువాక ప్రాంత కార్పొరేటర్లు, ఎమ్మార్వో, ఎంఈఓ గారు, కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలి వినోద్ బాబు, హిందీ లెక్చరర్ నరసింహమూర్తి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ గోడ గడియారం అందజేత



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలకు విద్యాభిమానులు మాడమోని లావణ్య శేఖర్ లు మంగళవారం డిజిటల్ గోడ గడియారంను అందజేశారు. లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన మాడమోని లావణ్య శేఖర్ దంపతులకు చెందిన ఇద్దరు పిల్లలు శ్వేత మహంతి, అభిజిత్ లు స్థానికంగా లక్ష్మీ పల్లి ప్రాథమిక పాఠశాల లో చదువుతున్న నేపథ్యంలో లావణ్య శేఖర్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలకు డిజిటల్ గోడ గడియారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత లావణ్య శేఖర్ మాట్లాడుతూ జీవితం లో సమయం ఎంతో విలువైనదని అన్నారు. విద్యార్థులు సమయాన్ని సరిగ్గా వినియోగించుకుని ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్ర శేఖర్ మాట్లాడుతూ డిజిటల్ గోడ గడియారం ద్వారా విద్యార్థులు సమయపాలనను అలవాటు చేసుకోని క్రమ శిక్షణను పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం డిజిటల్ గోడ గడియారం దాత మాడ మోని లావణ్య శేఖర్ ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల హెచ్ యం ఎస్. కల్పన, ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్, విజయ లక్ష్మీ, నాగేశ్వర్ రెడ్డి, విద్యా వాలంటర్ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్
- దేవరకద్రలో లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత



జయభేరి, దేవరకద్ర :

ప్రజా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం లో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా ఎమ్మెల్యే నాయకులు, అధికారులతో కలిసి లబ్ధిదారుల చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. సాగు, తాగునీటి రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యా రంగం అభివృద్ధికి ఏడాది ప్రభుత్వం పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టబోతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు. అన్ని వర్గాల వారిని ప్రభుత్వం ఆదుకోవడానికి కృషి చేస్తుందన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో ఆర్థిక ఉపశమనం



జయభేరి, గజ్వేల్, మార్చి 31 :

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో ఆర్థిక ఉపశమనం కలిగిస్తున్న ప్రముఖ సంక్షేమ కార్యక్రమంగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు సుమారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 290.27 కోట్లు మహిళా ప్రయాణికులు ప్రయోజనం పొందగా, వారు కలిపి సుమారు రూ. 10,012.15 కోట్లు రవాణా ఖర్చులను ఆదా చేసుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా M.శారద,ప్రజ్ఞాపూర్ గర్ల్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం ద్వారా వారి రోజువారీ ఖర్చులు తగ్గి, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతోంది. విద్య, ఉపాధి, వైద్య సేవలు వంటి అవసరాల కోసం మహిళలు సులభంగా ప్రయాణించే అవకాశం ఈ పథకం ద్వారా కలుగుతోంది అని తెలిపారు.డిపో మేనేజర్ పావన్ మాట్లాడతూ ప్రతిరోజూ బస్సు సేవలను వినియోగిస్తున్న మహిళా ప్రయాణికులను గౌరవిస్తూ, కొంతమంది దైనందిన మహిళా ప్రయాణికులను సంస్థ తరపున సన్మానించడం జరిగింది. వారి అనుభవాలను పంచుకుంటూ, పథకం పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేశారు.మహాలక్ష్మి పథకం రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు తీసుకుంటున్న కీలక నిర్ణయాలలో ఒకటిగా నిలుస్తోంది.

మహిళల నుండి ఈ పథకానికి విశేష స్పందన లభిస్తోంది అని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఈ పథకం ప్రారంభించిన 09/12/2023 నుండి 30/03/2026 వరకు 2.76 (రెండు కోట్ల డెబ్బై ఆరు లక్షల) మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించి 104 (నూట నాలుగు కోట్ల )రూపాయలు ఆదా చేసుకున్నారు. ప్రభుత్వం భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ, మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని సంకల్పించింది.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బాబు నాయక్ గారు,మెకానికల్ సూపెర్వైసోర్ జమీల్ గారు, మహిళా ప్రయాణికులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.




## గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి

జయభేరి, పత్తికొండ నూర్ :

పత్తికొండలో హోటల్ చిరు వ్యాపారస్తులకు సంబంధించిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి రాజా సాహెబ్ యు కారుమంచి డిమాండ్ చేశారు మంగళవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమం సిపిఐ పట్టణ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి రాజా సాబ్ యు కారుమంచి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తికొండ పట్టణంలో ఎల్పిజి గ్యాస్ సిలిండర్లను అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ ఆధ్వర్యంలో ఈ రోజు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా కొన్ని వ్యక్తులు గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి, వినియోగదారులకు అధిక ధరలకు అమ్ముతూ ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధమైన అక్రమ కార్యకలాపాల వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, అక్రమంగా గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్ద ఈరన్న నెట్టకంటయ్య ఏఐవైఎఫ్ నాయకులు రమేష్ సురేష్ ప్రజా సంఘాల నాయకులు గుండు బాషా రంగన్న రవికుమార్ రవి అనిల్ మహిళలు ఈ కార్యక్రమంలో పేర్కొన్నారు.

## రెండు కేసుల్లో ముగ్గురు అరెస్టు



జయభేరి, ఏలూరు :

చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్లకు, దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను రెండు వేరు వేరు కేసుల్లో ముగ్గురు దొంగలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 18.80 లక్షలు విలువ చేసే,154 గ్రాముల బంగారు భరణాలు, 808 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏలూరు పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వివరాలను వెల్లడించారు ఏలూరు జిల్లాలో చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న బండి గోపాలకృష్ణ, కుక్కల హరి ప్రకాష్‌లను చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 12.80 లక్షల విలువచేసే 128 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 19వ తేదీన నెల మండలం బాబాయపాలెం గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో కాకర్ల నాగ దుర్గారావు అరెస్ట్ చేశారు నిడమర్రు పోలీసులు. ఈ దొంగ నుంచి 6 లక్షల విలువ చేసే 26 గ్రాముల బంగారం,808 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారని అన్నారు.

# మహాలక్ష్మి పథకం విజవంతం

- తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 10.000 కోట్ల రూపాయలు ఆదా

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ డిపో పరిధి బస్సులలో 2.64 కోట్ల ప్రయాణాలకు గాను రూ.142 కోట్లు ఆదా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్. ప్రజాపాలన ప్రగతి పథం అనే నినాదంతో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి పది వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా నేడు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ దేవరకొండ వారి ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వారం రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆర్థిక భారం లేకుండా స్వేచ్ఛగా ప్రయాణిస్తూ, తమ దైనందిన అవసరాలను సులభంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత దిశగా ఇది ఒక కీలకమైన అడుగు అని, ఈ పథకం వల్ల మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, వారి జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయని ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని అన్నారు. ఇకపై కూడా ప్రజల సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందిన మహిళలను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, ఆర్.ఎం (ఏం) నల్లగొండ భీంరెడ్డి, డీఎం విజయ కుమారి, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి, ఆర్టీసీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## గృహప్రవేశానికి హాజరైన దేవస్థానం చైర్మన్ దంపతులు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం స్థానికుడైన కల్వ ఈశ్వర్ నిర్వహించిన నూతన గృహప్రవేశ పూజా కార్యక్రమానికి స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో వారు పాల్గొని ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

## లలితమ్మ దశదినకర్మ హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బలసుపల్లి ఆది హనుమంత్ రెడ్డి తల్లి లలితమ్మ దశదినకర్మకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా లలితమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## గంజాయి సరఫరా నిందితులన్ని పట్టుకొన్న పరవాడ పోలీస్ శాఖ

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గంజాయి నియంత్రణపై నిరంతరం పరవాడ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.2021 నవంబర్ నెల 18 తారీకు లంకెలపాలెం జంక్షన్ వద్ద 112 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటనలో నిందితులు గత 2021 సంవత్సరం నుండి పరారీలో ఉన్నారు.ఈ క్రమంలో మంగళవారం సీఐ మల్లికార్జునరావు వారు సిబ్బందితో కలిసి లంకెలపాలెం జంక్షన్ వద్ద దేవరపల్లి గ్రామం, జి. మాడుగుల మండలం కు చెందిన నిందితులుపంగి రాంబాబు, పంగి అంజిబాబులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్ నిమిత్తం అనకాపల్లి 11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమక్షంలో హాజరు పరచగా కోర్టు రిమాండ్ ఆదేశాలు జారీ చేయగా వారిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు.పరవాడ పోలీసులు గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలపై మరింత కట్టుదిట్టంగా చర్యలు కొనసాగిస్తారని తెలియజేశారు.

# ముఖ్యమంత్రి చేతుల మీదుగా సాయం

**జయభేరి, హైదరాబాద్ :**



ట్యాంక్‌బండ్‌పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయంతో పాటు ట్యాంక్‌బండ్ శివ కుమారుడు వేణుమాధవ్‌కు హోం గార్డు ఉద్యోగం ఇస్తూ అందుకు సంబంధించిన నియామకపత్రాన్ని అందజేశారు. ప్రమాదవశాత్తు, లేదా ఇతరత్రా హుస్సేన్ సాగర్ (ట్యాంక్ బండ్)లో పడిన ఎంతోమంది ప్రాణాలను శివ కాపాడారు.

అయితే, కుటుంబ పోషణ భారమై శివ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలియడంతో ముఖ్యమంత్రి స్పందించారు. శివకు అవసరమైన సహాయం అందించాలని కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే శివ కుటుంబం ముఖ్యమంత్రిని కలిశారు.

ఉపాధి కోసం ట్యాంక్‌బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా శివ కోరడంతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. సహృదయంతో స్పందించడమే కాకుండా ముఖ్యమంత్రి చేతుల మీదుగా సాయం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ట్యాంక్‌బండ్ శివ కుటుంబ సభ్యులు అన్నారు.

# కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

- ఏప్రిల్ 4వ తేదీన ఉదయం 11:30 గంటలకు విచారణకు రావాలని సీఐడీ నోటీసులు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 31**



బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు ఇచ్చింది. గతంలో మేడారం సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా జరిగిన వివాదానికి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 4వ తేదీన ఉదయం 11:30 గంటలకు విచారణకు రావాలని నోటీసులలో సీఐడీ పేర్కొంది. ఈ ఒక్క కేసులోనే కౌశిక్ రెడ్డితో పాటు మొత్తం 16 మంది బీఆర్ఎస్ నాయకులకు నోటీసులు అందినట్లు తెలుస్తోంది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎటువంటి తప్పు చేయకపోయినా, కేవలం ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో తనకు, తన కుటుంబ సభ్యులకు మరియు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు సీఐడీ నోటీసులు ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో, తనపై కాకుండా తన కుటుంబ సభ్యులపై ఇలాంటి బెదిరింపులకు దిగడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పోరాటం ఏదైనా ఉంటే నేరుగా తనతో చేయాలని, కుటుంబాన్ని ఇందులో లాగడం బాధాకరమని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. "నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై కేసులు పెట్టండి, నోటీసులు ఇవ్వండి.. కానీ నా కుటుంబాన్ని మరియు పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టకండి" అని కౌశిక్ రెడ్డి హితవు పలికారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని నోటీసులు వచ్చినా తాను భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ అణచివేత ధోరణికి భయపడి వెనక్కి తగ్గనని, ప్రజల పక్షాన నిలబడి తన పోరాటాన్ని కొనసాగిస్తానని భరోసా ఇచ్చారు.ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తాను ప్రశ్నిస్తూనే ఉంటానని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది తన వ్యక్తిగత పోరాటం కాదని, ప్రజల కోసం తాను చేపట్టిన బాధ్యత అని ఆయన అభివర్ణించారు. ప్రశ్నించే గొంతును అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదని, ప్రజా సమస్యలపై తన నిలదీత కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు తన సంకల్పాన్ని దెబ్బతీయలేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గతంలో తన నియోజకవర్గం హుజూరాబాద్‌లో జరిగే మినీ సమ్మక్కసారలమ్మ జాతరకు తన కుటుంబంతో కలిసి వెళ్తున్న కౌశిక్ రెడ్డిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, హుజూరాబాద్ రోడ్డుపై బైఠాయించి భారీ నిరసన చేపట్టారు. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేయడమే కాకుండా, కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఉద్దేశించి కొన్ని మతపరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలను ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించి, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.



## కోర్ర తండా ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందక అవస్థలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణం కోర్ర తండా గ్రామపంచాయతీ ప్రజలకు మిషన్ భగీరథ నీళ్లు రాక అవస్థలు పడుతున్న కొర్ర తండ ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు నెల కిందట పైపులు పగిలిపోయాయని చెప్పడం జరిగింది గ్రామ సర్పంచి మాట కూడా వినని అధికారులు ఈ విషయం జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్ తెలియజేయగానే స్పందించి వెంటనే ఎంపీడీవోకు ఫిర్యాదు ఇవ్వగా మిషన్ భగీరథ నీళ్లు అతి త్వరలో అందిస్తామని చెప్పడం జరిగింది కానీ ఇప్పటికి వారం గడిచిన మిషన్ భగీరథ నీళ్లు అందక అవస్థలు పడుతున్న ప్రజలు వెంటనే అధికారులు ఈ విషయంపై స్పందించి సమస్యని పరిష్కరించకపోతే గ్రామ ప్రజలు వందల మందితో బిందెలు తీసుకొచ్చి రోడ్డుపైన ధర్నా నిరసన నిర్వహించాల్సి వస్తుందని అధికారులకు చందు నాయక్ హెచ్చరించారు.

## నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**జయభేరి, చందంపేట :**

దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కృషితో రేకులగడ్డ గ్రామపంచాయతీలో 5 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టబోయే నూతన సిసిరోడ్డు పనులను ను ప్రారంభించిన రేకులగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎలుక జలంధర్, ఉప సర్పంచ్ నర్సయ్య, వార్డు సభ్యులు రావుల పిచ్చయ్య, మాజీ సర్పంచ్ ఎడ్ల అంజయ్య గ్రామ పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి మంత్రి లోకేష్ అండ

- గతేడాది కర్నూలు వద్ద విద్యుత్ షాక్ తగిలి అర్జున్ మృతి
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జున్ కుటుంబాన్ని కలిసిన మంత్రి లోకేష్
- ధైర్యంగా ఉండాలని, జీవితాంతం అండగా ఉంటానని భరోసా



**జయభేరి, మంగళగిరి:**

తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ఎప్పుడు, ఏ ఆపద వచ్చినా అండగా నిలిచే మంత్రి నారా లోకేష్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గతేడాది కర్నూలు జిల్లా నన్నూరు వద్ద విద్యుత్ షాక్ తగిలి మునగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎమ్.అర్జున్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అర్జున్ కుటుంబ సభ్యులను మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి మంత్రి పిలిపించారు. దివంగత అర్జున్ తల్లిదండ్రులు మస్తిక్ మద్దిలేటి, రాణితో పాటు సోదరి కోమలితో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అర్జున్ మరణం బాధించిందని చెప్పారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అర్జున్ సోదరి కోమలి చదువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, జీవితాంతం అండగా ఉంటానని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి అండగా నిలవడం పట్ల మంత్రి నారా లోకేష్‌కు అర్జున్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# బెజవాడ దుర్గమ్మ ఆలయంలో ఇంటి దొంగలు

**జయభేరి, విజయవాడ, మార్చి 31**



ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో అనుమానాస్పద పరిణామాలు చోటుచేసుకున్నాయి. లెక్కింపు సమయంలో వచ్చిన అసలైన బంగారు ఆభరణాలను దారి మళ్లించేందుకు యత్నించారు. కొంతమంది సిబ్బంది రోల్డ్ గోల్డ్ గా చూపిస్తూ పక్కన పెట్టే ప్రయత్నం చేసినట్టు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులకు అనుమానం కలగడంతో వెంటనే పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో సుమారు రూ.1.25 లక్షల విలువైన బంగారు వస్తువులు పక్కన పెట్టినట్టు బయటపడింది. దీంతో సంబంధిత సిబ్బందిని అక్కడికక్కడే పట్టుకుని విచారణ ప్రారంభించారు.ఈ ఘటనపై దుర్గగుడి దేవస్థానం ఈవో శీనా నాయక్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులైన సిబ్బందికి వెంటనే మెమోలు జారీ చేయడంతో పాటు, పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇచ్చారు. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలు సహించబోమని స్పష్టం చేశారు. కొత్త ట్రస్ట్ బోర్డు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి ఘటన వెలుగు చూడటం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఇప్పటికే సీసీ కెమెరాలు, త్రిసభ్య కమిటీ పర్యవేక్షణ ఉన్నప్పటికీ అక్రమాలు కొనసాగుతుండటంపై భక్తులు మండిపడుతున్నారు.దేవుడి దగ్గర కూడా అక్రమాలు అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హుండీ లెక్కింపులో మరింత పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. భక్తుల విశ్వాసం నిలబెట్టుకోవడం దేవస్థానం ముందున్న పెద్ద సవాల్‌గా మారింది. కఠిన చర్యలు తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, ఈ వివాదం మరింత పెద్దదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామం కొర్రతండా లో ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో మంజూరైన 5 లక్షల వ్యయంతో కూడిన సీసీ రోడ్డు పనులను నేడు మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు కొర్ర కిషన్ నాయక్,సునీత బద్దు నాయక్ ,పులిజాల సంతోష వెంకట్ ,మాజీ సర్పంచ్ పాండు నాయక్ ,గ్రామ పెద్ద మనిషి శ్రీకాంత్ నాయక్,కాంగ్రెస్ నాయకులు కొర్ర గణేష్ నాయక్,జబ్బార్ లాల్,దిప్ల నాయక్, శ్రీకాంత్ వాలు తదితరులు పాల్గొన్నారు.




# పోరాడి ఓడిన గుజరాత్..!

## ఒంటిచేత్తో పంజాబ్‌ను గెలిపించిన కూపర్..

పంతొమ్మిదో సీజన్‌లో వరుసగా నాలుగో మ్యాచ్‌లో ఛేజింగ్ జట్టే విజేతగా నిలిచింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ అదిరే బోణీ కొట్టింది. బౌలర్ల విజృంభణతో గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసిన పంజాబ్‌ను కూపర్ కొన్నొల్లీ(74 నాటౌట్) ఒంటిచేత్తో గెలిపించాడు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(37) మెరుపులతో అలవోకగా లక్ష్యాన్ని అందుకునేలా కనిపించినా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ప్రసిధ్ కృష్ణ(329) వరుస వికెట్లతో భయపెట్టాడు. కానీ, చివరిదాకా నిలబడిన కూపర్.. గ్జావియర్ బార్ట్‌లెట్(11 నాటౌట్)తో కలిసి జట్టును గెలిపించాడు.

పద్దెనిమిదో సీజన్ రన్నరప్ పంజాబ్ కింగ్స్ విజయంతో పంతొమ్మిదో సీజన్‌ను మొదలెట్టింది. ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్‌పై వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కూపర్ కొన్నొల్లి(74 నాటౌట్) అర్ధశతకంతో జట్టును గెలిపించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా చివరిదాకా నిలబడిన కూపర్ పంజాబ్‌ను విజయ తీరాలకు చేర్చాడు. ముల్లన్‌పూర్‌లో గుజరాత్‌ను 162కే కట్టడి చేసిన పంజాబ్ కింగ్స్‌కు కగిసో రబడ ఆదిలోనే షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(7) అశోక్ శర్మ క్యాచ్ అందుకోగా పెవిలియన్ చేరాడు. 7 పరుగులకే వికెట్ పడిన వేళ కూపర్ కొన్నొల్లి() జతగా మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(37) లు దూకుడుగా ఆడాడు. రెండో వికెట్‌కు 76 రన్స్ జోడించిన ఈ జంటను రషీద్ ఖాన్ విడదీశాడు.

ప్రభ్‌సిమ్రన్ ఔటయ్యాక వచ్చిన శ్రేయాస్ అయ్యర్(18), నేహల్ వధేరా(3)లు విఫలమయ్యారు. అప్పటికీ పంజాబ్ విజయానికి 42 బంతుల్లో యాభై రన్స్ అవసరమవ్వగా కొన్నొల్లి, శషాంక్ సింగ్()లు జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్నారు. కానీ, ఇంపాక్ట్ ప్లేయర్ ప్రసిధ్ కృష్ణ(329) తెలివైన బౌలింగ్‌తో వరుస బంతుల్లో శశాంక్, మార్కస్ స్టోయినిస్(0)ను ఔట్ చేయడంతో గుజరాత్ రేసులోకి వచ్చింది. రబడ ఓవర్లో కొన్నొల్లి రెండు ఫోర్లు బాదగా.. ప్రసిధ్ బౌలింగ్‌లో యాన్సెస్ సిక్సర్‌తో మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పాడు. ప్రసిధ్ విసిరిన షార్ట్ పిచ్ బంతిని గ్జావియర్ బార్ట్‌లెట్(11 నాటౌట్) స్టాండ్స్‌లోకి గుజరాత్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్లో 2 పరుగులు అవసరమవ్వగా.. బౌండరీతో పంజాబ్‌కు 3 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు కూపర్.

గుజరాత్ టైటాన్స్ శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఓపెనర్లు సాయి సుదర్శన్(13), శుభ్‌మన్ గిల్(39)లు రాణించినా.. సొంత మైదానంలో పంజాబ్ కింగ్స్ బౌలర్ల ధాటికి గుజరాత్ మిడిలార్డర్ తేలిపోయింది. సాయిని ఔట్ చేసిన యాన్సెన్ తొలి బ్రేకివ్వగా.. జోస్ బట్లర్(38)తో కలిసి గిల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, చాహల్ ఓవర్లో అతడు కొన్నొల్లి చేతికి చిక్కడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం గ్లెన్ ఫిలిప్స్(25) మెరుపు బ్యాటింగ్‌తో అలరించి స్కోర్‌బోర్డును ఉరికించాడు.

అయితే.. విజయ్‌కుమార్ ఓవర్లో అతడు అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. కాసేపటికే చాహల్ బౌలింగ్‌లో సిక్సర్‌కు యత్నించిన బట్లర్ బౌండరీ లైన్ వద్ద బార్ట్‌లెట్ పైకెగిరి క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంజాబ్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా బంతులు సంధించగా వాసింగ్టన్ సుందర్(18), షారుక్ ఖాన్(4), రాహుల్ తెవాటియా (11నాటౌట్)లు బౌండరీలు కొట్టేందుకు ఇబ్బంది పడ్డారు. చివరి ఓవర్లో అర్ష్‌దీప్ వైడ్స్ వేయడంతో గుజరాత్ 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేయగలిగింది.




# తెలంగాణ పతక జోరు

## ఖేలో ఇండియా గిరిజన క్రీడలు

జయభేరి, హనుమకొండ, మార్చి 31 :

చత్తీస్‌గఢ్ వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా గిరిజన క్రీడల్లో తెలంగాణ ప్లేయర్లు సత్తాచాటారు. మంగళవారం జరిగిన రెజ్లింగ్‌తో పాటు అథ్లెటిక్స్‌లో స్వర్ణం సహా రజతం, రెండు కాంస్య పతకాలు మన ఖాతాలో చేరాయి.

మహిళల రెజ్లింగ్ 57కిలోల విభాగంలో యువ రెజ్లర్ నాగలక్ష్మి పసిడి పతకంతో మెరిసింది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్ పోరులో నాగలక్ష్మి 100 తేడాతో సాయి సిద్ది(కర్ణాటక)పై అలవోక విజయం సాధించింది.

పురుషుల గ్రీకోరోమన్ 77 కిలోల పోరులో జాదవ్ చరణ్(తెలంగాణ) 80తో హనీశ్‌కుమార్(చత్తీస్‌గఢ్) పై గెలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. గ్రీకోరోమన్ 135కిలోల నార్డిక్ విభాగంలో రాజు కాంస్యం దక్కించుకున్నాడు.

మరోవైపు జగ్దల్‌పూర్‌లో జరిగిన అథ్లెటిక్స్ 110మీటర్ల హార్డిల్స్‌లో దత్తు రజత పతకం సొంతం చేసుకున్నాడు.

ఇదిలాఉండగా గిరిజన క్రీడల రెజ్లింగ్ మహిళల విభాగంలో తెలంగాణ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచింది.



# ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టులకు బ్రేక్..

## గంగూలీ రియాక్షన్ ఇదే..!

భారత్‌లో టెస్టు మ్యాచ్‌లకు కొన్ని మైదానాలు కేరాఫ్. ప్రతి సిరీస్‌లో కచ్చితంగా ఆయా స్టేడియాల్లో మ్యాచ్‌లు ఉండేలా భారత క్రికెట్ నియంత్రణ మండలి(BCCI) షెడ్యూల్ ప్రకటిస్తుంది. ఈ లెక్కన కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో మ్యాచ్ ఉండి తీరుతుంది. అయితే.. ఈసారి 2026, 27 షెడ్యూల్‌లో ఈడెన్‌ను కాదని మిగతా వేదికలకు మ్యాచ్‌లు కేటాయించింది బీసీసీఐ. దాంతో, ఈ విషయంపై రగడ మొదలైంది. అయితే.. ఈ అంశంపై బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరభ్ గంగూలీమాత్రం సానుకూలంగా స్పందించాడు. టెస్టు క్రికెట్‌ను మరిన్ని మైదానాలకు విస్తరించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలోనే 2026, 27 సీజన్‌లో భారత జట్టు ఐదు టెస్టులు ఆడనుంది. ఆశ్చర్యంగా వాంఖడే స్టేడియం(ముంబై), ఈడెన్ గార్డెన్స్(కోల్‌కతా)లు మాత్రం వేదికలుగా ఎంపికవ్వలేదు. దాంతో, ఘన చరిత్ర కలిగిన ఈ రెండు మైదానాల్లో మ్యాచ్‌లు ఆడించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. టెస్టు మ్యాచ్‌లను మిగతా వేదికల్లో జరపడం శుభపరిణామం అని క్యాబ్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ అన్నాడు. ‘ఈడెన్ గార్డెన్స్‌లో పెద్ద టెస్ట్ మ్యాచ్‌లు జరగడం గొప్పగా అనిపిస్తుంది. మాజీ ఆటగాడిగా, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఈ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించడానికి ప్రయత్నిస్తా. అయితే.. దక్షిణాఫ్రికాతో టెస్టు మ్యాచ్, ఆపై టీ20 ప్రపంచకప్, ఇప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌లు ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతున్నాయి. ఈడెన్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడించాలని నేను అనుకుంటాను. కానీ, అదే సమయంలో ఇతర మైదానాల్లో కూడా మ్యాచ్‌లు జరగాలిగా’ అని గంగూలీ పేర్కొన్నాడు. వచ్చే ఏడాది ఆరంభంలో బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీలో భారత్, ఆస్ట్రేలియా ఐదు టెస్టులు ఆడనున్నాయి. జనవరి 21 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ మ్యాచ్‌లను నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు.



# రష్యన్ భామల బ్యూటీ సీక్రెట్స్!

**రష్యా పడతులు.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తారు. లేత గులాబీ వర్ణంలో.. అందానికి సరికొత్త నిర్వచనంగా మెరిసిపోతుంటారు. తాజాగా, వీరి బ్యూటీ సీక్రెట్స్‌ను వెల్లడించారు బ్యుటీషియన్లు. రష్యా మహిళల మేనిఛాయ రహస్యాన్ని బయటపెట్టారు.**

చర్మాన్ని శుభ్రపరచడానికి రష్యా మహిళలు 'బన్యా స్టీమ్‌బాత్'ను ఎక్కువగా ఆశ్రయిస్తారు. ఈ స్టీమ్‌బాత్ వల్ల చర్మ రంధ్రాలు లోతుగా శుభ్రమవుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఈ పురాతన చర్మ సంరక్షణ పద్ధతితో.. మానసికశారీరక విశ్రాంతితోపాటు చర్మానికి మెరుపు, ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. ప్లాస్టిక్, రసాయన ఉత్పత్తులకు పూర్తి దూరంగా ఉంటారు.

చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు బిర్చ్/ఓక్ కొమ్మలతో తయారైన స్క్రబ్‌లను ఉపయోగిస్తారు. వీటితో చర్మాన్ని సున్నితంగా మసాజ్ చేయడం వల్ల.. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

ఎప్పుడూ చల్లగా, పొడిగా ఉండే రష్యాలో.. చర్మం పొడిబారుతూ ఉంటుంది. అందుకే, చర్మాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి కొన్ని రకాల సముద్రపు ఉత్పత్తులు, పొద్దు తిరుగుడు, ఆముదం నూనెను వాడుతారు. వీటిలో చర్మ ఆరోగ్యాన్ని రక్షించే పోషకాలు, వృద్ధాప్య నిరోధక లక్షణాలు ఎక్కువ. అవి చర్మం, జుట్టుకు మంచి హైడ్రేషన్ అందిస్తాయి.


కోల్డ్ వాటర్ థెరపీ, ఐస్ ఫేషియల్స్‌తో చర్మాన్ని ఎప్పటికప్పుడు రిఫ్రెష్‌గా ఉంచుకుంటారు. ఈ థెరపీలతో ముఖచర్మం బిగుతుగా మారుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటంతోపాటు ముడతలూ తగ్గుముఖం పడుతాయి.

ఇక కళ్ల కింద వాపును నివారించడంలో కోల్డ్ వాటర్ థెరపీ అద్భుతంగా పనిచేస్తుంది.

రష్యన్ల సాంప్రదాయ మాస్క్‌లలో ఎక్కువగా ఉపయోగించే పదార్థాలు.. సోర్ క్రీం, తేనె. వంటింట్లో నిత్యం అందుబాటులో ఉండే ఈ పదార్థాలు.. చర్మాన్ని తేమగా, కాంతివంతంగా ఉంచుతాయి.

ఇక క్లెన్సర్లుగా పాల ఉత్పత్తులకు ఓటేస్తారు రష్యన్ అమ్మాయిలు. ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని మృదువుగా, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సాయపడుతుంది. చర్మం పీహెచ్ సమతుల్యతను కాపాడటంతోపాటు చర్మ సహజవర్ణాన్ని మెరుగు పరచడంలోనూ ముందుంటుంది.

..ఇలా రసాయన ఉత్పత్తులపై ఎక్కువగా ఆధారపడకుండానే రష్యన్ అమ్మాయిలు అందాన్ని కాపాడుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ.. 'బ్యూటీ'కి కేరాఫ్‌గా నిలుస్తున్నారు.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

(*NOTE*: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)



# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు..
# మంచిగా పడుకోవాలంటే...

**ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది.**

కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం. ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి.

ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్రలేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు.

ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది. దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచి నిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.

### ఎవరెవరికి ఎంతెంత?

ఏడాదిలోపు పసిపిల్లలకు.. రోజుకు 12 నుంచి 16 గంటల నిద్ర అవసరం ఉంటుంది.

ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులు 11 నుంచి 14 గంటలు నిద్రపోవాలి.

మూడు నుంచి ఐదేళ్లలోపు వారికి .. రోజుకు 10 నుంచి 13 గంటలు నిద్రపోతే ఆరోగ్యం.

పాఠశాలకు వెళ్లే ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లలు రోజుకు 9 నుంచి 12 గంటలు నిద్రపోవాలి.

యుక్త వయసులోకి వచ్చిన వారు ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల వరకు నిద్రించాలి.

### మంచి నిద్ర రావాలంటే..

పిల్లలు మంచి నిద్రపోయేలా వారి వయసుకు తగ్గట్లుగా కొన్ని అలవాట్లు చేయాలి. పడుకునే ముందు పిల్లలు రిలాక్స్ కావాలి. 'బెడ్ రొటీన్స్'ను అలవాటు చేయాలి. చిన్నారుల రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి. అలాగే, రాత్రిపూట డిన్నర్ లైట్‌గా ఉండేలా చూసుకోవాలి.

రాత్రిపూట నిద్రపోవడానికి మారాం చేసే పిల్లలకు పెరుగన్నం, అరటిపండును తినిపిస్తే.. త్వరగా పడుకునే అవకాశం ఉంటుంది.

పడుకునే ముందు పిల్లలకు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తే.. త్వరగా నిద్రపోతారు.

ఇంట్లో అందరూ ఒకే సమయానికి నిద్రపోతే.. వారితోపాటు పిల్లలూ నిద్రలోకి జారుకుంటారు.





## మాస్ లుక్ లో ఫరియా అబ్దుల్లా

జాతిరత్నాలు సినిమాతో పరిచయమైన ఫరియా.. ఆ సినిమాలో తన క్యూట్ పర్ఫామెన్స్ తో కట్టిపడేసింది. అలాగే తర్వాత వచ్చిన సినిమాల్లో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది. తన అందాలతో మతిపోగొట్టింది ఫరియా అబ్దుల్లా.. కానీ సినిమాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. సింహ హీరోగా నటించిన మత్తువదలరా 2 సినిమా ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. కానీ ఆతర్వాత మళ్లీ ఫ్లాప్స్ పలకరించాయి. చివరిగా ఈ అమ్మడు గుర్రం పాపిరెడ్డి అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు రూటు మార్చి మాస్ పాత్రతో ఆకట్టుకోనుంది. ప్రస్తుతం ఫరియా అద్బుల్లా భగవంతుడు అనే సినిమాలో నటిస్తుంది. ఇటీవలే ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. ఈ టీజర్ లో ఫరియా అద్బుల్లా మాస్ పాత్రలో కనిపించింది. అలాగే బోల్డ్ గానూ నటించింది. ఈ సినిమాతో ఫరియా అద్బుల్లా హిట్ కొట్టేలా కనిపిస్తుంది. కాగా సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు ఓ రేంజ్ లో అందాలతో రచ్చ చేస్తుంది. కుర్రాళ్లు చూపుతిప్పుకోనివ్వకుండా ఫోటోలు షేర్ చేస్తుంది. ఈ సుందరి షేర్ చేసే ఫోటోలకు కుర్రకారు ఫిదా అవుతున్నారు. నెటిజన్స్ రెచ్చిపోయి కామెంట్స్ చేస్తున్నారు.



## పూరి జగన్నాథ్ పరిచయం.. నా లైఫ్‌కు టర్నింగ్ పాయింట్..

టాలీవుడ్ ఇండస్ట్రీలో సంగీత దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు రఘు కుంచె. కానీ చాలా కాలంగా ఇండస్ట్రీలో ఆయన సైలెంట్ అయిన సంగతి తెలిసిందే. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు మారిన తర్వాత కూడా సంగీత పరిశ్రమ మాత్రం చెన్నై కేంద్రంగానే కొనసాగిందని రఘు కుంచె తన ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. చెన్నైలో అవకాశాల కోసం వెళ్లాల్సి రావడం, స్థానిక కళాకారులకు తక్కువ ప్రాధాన్యత లభించడం వంటి సవాళ్లను ఆయన వివరించారు. ఈ పరిస్థితుల్లో జెమినీ టెలివిజన్ ప్రారంభం ఆయనకు కొత్త ద్వారాలు తెరిచింది. జీకే మోహన్ పరిచయంతో "యువర్స్ లవింగ్లీ" కార్యక్రమానికి యాంకర్‌గా మారిన రఘు, దాదాపు పదేళ్ల పాటు మంచి పేరు సంపాదించుకున్నారు. ఆ సమయంలో ఎక్కువ మంది మహిళా యాంకర్లు ఉండగా, రఘు ఒక మేల్ యాంకర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారు. కెమెరామెన్ సుధాకర్, మధు పర్వా, శ్రీధర్ వంటి సాంకేతిక నిపుణుల సహకారంతో ఆయన ఇమేజ్ మరింత పెరిగిందని చెప్పారు. "యువర్స్ లవింగ్లీ" కార్యక్రమానికే సంగీత దర్శకుడిగా తన మొదటి పాటను కంపోజ్ చేసిన రఘు, దానిని చంద్రబోస్ గారు రచించారని తెలిపారు. "క్షేమమా స్నేహం" పల్లవితో సాగే ఆ పాట అప్పట్లో ఎంతో మందిని అలరించిందని, ఇప్పటికీ చాలా మంది ఆ పాటను గుర్తుంచుకోవడం తన కెరీర్‌కు ఎంతో తోడ్పడిందని ఆయన పేర్కొన్నారు. ఈ దశలో పూరి జగన్నాథ్‌తో రఘు కుంచెకు పరిచయం ఏర్పడింది. జెమినీ టీవీలోకి రాకముందే పూరితో ఈ పరిచయం జరిగిందని, ఇది తన జీవితంలో అతి పెద్ద టర్నింగ్ పాయింట్ అని రఘు స్పష్టం చేశారు. పూరి జగన్నాథ్ అప్పుడు దర్శకుడిగా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న ఒక స్ట్రగ్లర్ అని, శ్రీకాంత్, ఆహుతి ప్రసాద్, శివాజీ రాజా వంటివారితో కలిసి మధు ఫిలిం ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి బృందంలో ఒకరని రఘు తెలిపారు. కొన్నాళ్లు తామిద్దరం రూమ్‌మేట్స్‌గా కూడా ఉన్నామని, ఆ తర్వాత పూరికి "బద్రి" సినిమా, ఆపై "బాచి" చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం వచ్చిందని చెప్పారు. "బాచి" సినిమాలో "లక్ష్మి లక్ష్మి" పాటతో పూరి జగన్నాథ్ తనకు ప్లేబ్యాక్ సింగర్‌గా మొదటి అవకాశం ఇచ్చారని, చక్రి ఆ చిత్రానికి సంగీత దర్శకుడిగా పనిచేశారని రఘు పేర్కొన్నారు. "బాచి" సినిమా ఫ్లాప్ అయినా, "లక్ష్మి లక్ష్మి" పాట మాత్రం పెద్ద హిట్ అయిందని, ఈ పాట తర్వాతే చిరంజీవి "మృగరాజు" సినిమాలో పాడే అవకాశం తనకు లభించిందని రఘు కుంచె వివరించారు.

## లైన్‌లో మూడు సినిమాలు.. నితిన్ మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా..?



టాలీవుడ్ యాక్టర్ నితిన్ పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాను అనౌన్స్ చేశాడని తెలిసిందే. ఈ చిత్రాన్ని టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా వస్తున్న ఈ చిత్రానికి దర్శకుడెవరనేది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేసింది. తాజాగా దీనిపై క్లారిటీ వచ్చేసింది. ఈ మూవీని కొత్త డైరెక్టర్ టేకోవర్ చేయబోతున్నాడట. ఇదిలా ఉంటే నితిన్ మరోవైపు ఆయ్ ఫేం అంజి కే మణిపుత్ర డైరెక్షన్‌లో కూడా ఓ సినిమాను చేయబోతుండగా.. దీనికి సంబంధించి చాలా రోజుల కిందే అధికారికంగా ప్రకటన కూడా వెలువడింది. అయితే ఈ సినిమా ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఈ మూవీని రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిఖితా రెడ్డి నిర్మించనుంది. తిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు నితిన్. మరి ఇలా బ్యాక్ టు బ్యాక్ త్రీ మూవీస్‌ను లైన్‌లో పెట్టిన నితిన్ ఈ సారైనా మంచి బ్రేక్ అందుకుంటాడా..? అన్నది చూడాలి.

## సల్మాన్ ఖాన్ – వంశీ పైడిపల్లి సినిమాలో హీరోయిన్‌గా నయనతార!




ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో మరో భారీ క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా పరిచయం చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (SVC) బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దిల్ రాజు నిర్మాణ సంస్థకు ఇది 63వ చిత్రం (SVC63) కావడం విశేషం. ఈ అప్‌డేట్‌ను వెల్లడిస్తూ.. SVC63 ప్రాజెక్ట్‌లోకి ది క్వీన్ అడుగుపెట్టింది.. ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లోకి నయనతారను ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చిత్ర బృందం రాసుకొచ్చింది. నయనతార ఇప్పటికే షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి రికార్డు స్థాయి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు మరోసారి బాలీవుడ్ అగ్ర హీరో అయిన సల్మాన్ ఖాన్‌తో ఆమె జతకట్టడం భారతీయ సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ముగ్గురు దిగ్గజాలైన సల్మాన్ ఖాన్, నయనతార మరియు వంశీ పైడిపల్లి కలయికలో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. దర్శకుడు వంశీ పైడిపల్లి గతంలో దళపతి విజయ్ సరసన 'వారసుడు' (వారిసు) సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్‌ను ఆయన ఎలాంటి సరికొత్త కథతో చూపించబోతున్నారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలోనే అధికారికంగా వెల్లడించనుంది.



## ఏం వయ్యారం రా బాబు..

ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. తమ అందంతో కుర్రకారుకు కిర్రెక్కించి.. డ్రీమ్ గర్ల్ అనే ట్యాగ్ ను సొంతం చేసుకున్న వారిలో దివ్య భారతి ఒకరు. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళ్ సినిమా బ్యాచిలర్ మూవీతో సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ దివ్య భారతి.. ఈ సినిమాలో బోల్డ్ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది ఈ సుందరి. దాంతో ఈ బ్యూటీకి కుర్రాళ్ళు ఫిదా అయ్యారు. ఆతర్వాత ఈ అమ్మడు వరుస సినిమాలతో బిజీ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. చాలా గ్యాప్ తర్వాత జీవి ప్రకాష్ తో కలిసి కింగ్ స్టన్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక ఇప్పుడు తెలుగులో సినిమాలు చేస్తుంది ఈ అందాల తార. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. కానీ ఈ సినిమా విడుదలకు మాత్రం నోచుకోవడం లేదు.. ఎప్పటినుంచో ఈ సినిమా షూటింగ్ జరుగుతూ ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో దివ్యభారతి ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గ్లామరస్ ఫొటోలతో నెటిజన్స్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది దివ్య భారతి. తాజాగా ఈ అమ్మడు వదిలిన ఫోటోలు కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**